సాక్షి అనకాపల్లి

బుధవారం । 19 । మార్చి । 2025

రైతన్న గుండె మండింది..

గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో సక్రమంగా క్రషింగ్ జరపడం లేదని ఆవేదన నిండగా.. దేవరాపల్లి మండలం కొత్తపెంటలో ఓ రైతు గుండె మండింది.. అందుకే సాగు చేసి పండించిన తియ్యని చెరకు పంటకు తన చేత్తోనే నిప్పు పెట్టాడు. ఈ దయనీయ పరిస్థితి ఏ రైతుకూ రాకూడదని కన్నీళ్లు పెట్టుకున్నాడు.



మేడిచెర్ల రెవెన్యూ పరిధిలో రైతు నిప్పు పెట్టడంతో కాలిపోతున్న చెరకు పంట

8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	బుధ	గురు
అనకాపల్లి	6.12	4.47
నర్సీపట్నం	6.14	4.45

న్యూస్‌రీల్

ఆటోలో నగల బ్యాగ్ మరిచిపోయిన మహిళ

• నిజాయితీగా తిరిగి అప్పగించిన డ్రైవర్



పోలీసుల సమక్షంలో బాధితురాలికి అప్పగిస్తున్న డ్రైవర్

నక్కపల్లి : నక్కపల్లికి చెందిన ఓ మహిళ ఆటోలో మర్చిపోయిన బంగారం బ్యాగ్‌ను డ్రైవర్ నిజాయితీగా తిరిగి అప్పగించిన ఘటన మంగళవారం జరిగింది. సీఐ కుమారస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నక్కపల్లికి చెందిన శిరీష అనే మహిళ తుని వెళ్లేందుకు నక్కపల్లిలో ఆటో ఎక్కింది. తనతో తీసుకెళ్తున్న బ్యాగ్‌ను ఆటోలో మర్చిపోయింది. అందులో సుమారు రూ.7లక్షలు విలువైన ఎనిమిది తులాల బంగారు ఆభరణాలను ఉన్నాయి. దీంతో ఆమె నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేసేలోపు తునికి చెందిన ఆటోడ్రైవర్ గెడ్డమూరి అంజి నిజాయితీగా నక్కపల్లి మహిళ తన ఆటోలో మర్చిపోయిన బ్యాగ్‌ను, అందులో ఉన్న బంగారాన్ని నక్కపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చాడు. పోలీసుల సమక్షంలో బాధితురాలి ఇంటి వద్దకు తీసుకెళ్లి అందజేశాడు. డ్రైవర్ నిజాయితీకి మెచ్చి అతనికి కొంత నగదును కానుకగా అందజేశారు. సీఐ కుమార స్వామి ఆటోడ్రైవర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

28న తపాలా అదాలత్

మహారాణిపేట: విశాఖ పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 28న 117వ తపాలా అదాలత్ నిర్వహిస్తున్నారు. ఎంవీపీ కాలనీలోని పోస్టు మాస్టర్ జనరల్ కార్యాలయంలో ఈ అదాలత్ జరుగుతుందని తపాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి.డి.సాగర్ తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈనెల 24వ తేదీలోగా పోస్టు మాస్టర్ జనరల్ కార్యాలయం, విశాఖపట్నం–530017 చిరునామాకు పంపించాలని కోరారు.

• పడగ విప్పిన మైనింగ్ మాఫియా

కాటేస్తున్న క్వారీ లారీలు



మునకగపాక మెయిన్ రోడ్డు మీద క్వారీ లారీ ఢీకొని ప్రాణాలు కోల్పోయిన కన్నారావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత క్వారీ లారీలు పెరిగాయి. విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ప్రజల ప్రాణాలంటే, ప్రభుత్వ ఆస్తులంటే లెక్కలేని రీతిలో ఏది ఎదురుపడితే దానిని ఢీకొట్టి వెళ్లిపోతున్నాయి. పరిమితికి మించి అధిక లోడ్‌తో వెళ్లడమే ఇందుకు కారణం. రాంబిల్లి మండలంలో నేవల్ పనుల కోసం ప్రైవేటు ఆపరేటర్లు పెద్ద పెద్ద బండరాళ్లను, నల్లరాయిని, రోడ్డు మెటల్‌ను పెద్ద స్థాయిలో రవాణా చేస్తున్నారు. దీని వెనుక ఓ బడా ప్రజాప్రతినిధి ఉండడమే నిర్వాహకులు చెలరేగిపోవడానికి కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మునగపాక మెయిన్‌రోడ్డులో మితిమీరిన వేగంతో వచ్చిన క్వారీ లారీ ఢీకొని కొద్ది రోజుల క్రితం మాడా కన్నారావు అనే ఎల్‌ఐసీ ఏజెంట్ మృతి చెందారు. సోమవారం అనకాపల్లి టౌన్‌లో విజయరామరాజు పేట వద్ద గల రైల్వే అండర్ బ్రిడ్జి గడ్డర్‌ను క్వారీ లారీ ఢీకొనడంతో విరిగిపోయింది. సకాలంలో రైల్వే సిబ్బంది స్పందించడంతో భారీ ప్రమాదం తప్పింది.

- కూటమి ప్రభుత్వంలో పెరిగిన మైనింగ్ అక్రమ తవ్వకాలు
- ప్రజా ప్రతినిధుల అండతో చెలరేగిపోతున్న క్వారీ యాజమాన్యాలు
- పరిమితి మించి అధిక లోడ్‌తోనే ప్రమాదాలు
- రోజుకు 300 -350 క్వారీ లారీల రాకపోకలు
- కమిషన్ కోసం అతి వేగంగా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు
- మొన్న మునగపాకలో క్వారీ లారీ ఢీకొని ఎల్ఐసీ ఏజెంట్ మృతి
- నిన్న క్వారీ లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న రైల్వే గడ్డర్



అనకాపల్లిలో సోమవారం క్వారీ లారీ ఢీకొనడంతో విరిగిన రైల్వే అండర్ బ్రిడ్జి గడ్డర్



క్వారీ లారీలు

సాక్షి, అనకాపల్లి:

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జిల్లాలో మైనింగ్ మాఫియా పెరిగింది. కొండలను పిండి చేసి నల్లరాయిని దర్జాగా అమ్ముకుంటున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనూ అనుమతులకు మించి, పరిధి దాటి రాయి తవ్వకాలు చేపట్టడమే కాకుండా.. నిబంధనలకు విరుద్ధంగా వాటిని తరలిస్తున్నారు. పెద్ద పెద్ద బండరాళ్లను, నల్లరాయిని, రోడ్డు మెటల్‌ను రాంబిల్లి మండలంలో నేవీ ప్రత్యామ్నాయ ఆపరేషన్ బేస్‌కు రవాణా చేస్తున్నారు. సముద్ర తీరంలో జెట్టీ నిర్మాణానికి, బ్రేక్ వాటర్స్ కోసం భారీ ఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు పెద్ద పరిమాణంలో వుండే బండరాళ్ల అవసరం ఏర్పడింది. ఇదే అదునుగా మైనింగ్ అధికారుల సహకారంతో అనకాపల్లి, రోలుగుంట, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో రాయి క్వారీల నిర్వాహకులు నేవల్ బేస్ పనులకు బండరాళ్ల సరఫరా కోసం సంబంధిత కాంట్రాక్టర్లతో ఒప్పందాలు చేసుకున్నారు. చాలా వరకు అనుమతులు లేకుండానే ఇవి జరిగిపోయాయి. ఆయా మండలాల్లోని క్వారీల నుంచి నిత్యం వందలాది టిప్పర్లలో పెద్ద పెద్ద బండరాళ్లను తరలిస్తున్నారు.

కూటమి నేతల అక్రమ వసూళ్లు

మైనింగ్ పేరిట కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు లక్షలు ఆర్జిస్తున్నారు. టన్నుకు రూ.30 చొప్పున నెలకు సగటున రూ.కోటి 8 లక్షల అక్రమ వసూళ్లు చేస్తున్నారు. అదేవిధంగా ట్రాన్స్‌పోర్టు పరంగా చూస్తే ఒక లారీ రోజుకు రెండు నుంచి మూడు ట్రిప్పులు వేస్తుంది. రెండు లోడ్లకు 80 టన్నులు, మూడు లోడ్లు అయితే 120 టన్నులు రవాణా జరుగుతుంది. ఒక టన్నుకు రూ.500 చొప్పున నెలకు రూ.12 లక్షలు వసూలు చేస్తారు. 300 నుంచి 350 లారీలకు రూ.36 కోట్ల నుంచి రూ.40 కోట్లు వసూలవుతాయి. కూటమి ప్రజాప్రతినిధులైన స్థానిక ఎంపీ, స్థానిక ఎమ్మెల్యేలు ఈ దందా నడిపిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. అందుకే అధిక లోడ్‌తో రవాణా చేసినా .. ప్రమాదాలు జరిగినా అధికారులు, పోలీసులు చోద్యం చూస్తున్నారే తప్ప చర్యలు ఉండడం లేదు. అక్రమ మైనింగ్ దందాలన్నీ పార్లమెంట్ సభ్యుడు సీఎం రమేష్ కనుసన్నల్లోనే జరుగుతున్నాయని, అనకాపల్లిలో రైల్వే బ్రిడ్జి ప్రమాదానికి ఆయనే బాధ్యత వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం నేతృత్వంలోని బృందం సభ్యులు సోమవారం విమర్శించిన విషయం తెలిసిందే.

అనుమతి లేనివే ఎక్కువ

జిల్లాలో గనుల శాఖ అనుమతి వున్న రాయి/కంకర క్వారీలు 60 మాత్రమే ఉన్నాయి. కానీ ఒక్క అనకాపల్లి డివిజన్‌లోనే ఎటువంటి అనుమతులు లేకుండా 150కి పైగా క్వారీలు నడుస్తున్నాయి. అనకాపల్లి మండలంలోని మార్టూరు, మామిడిపాలెం, మాకవరం, ఊడేరు, కుంచంగి, కూండ్రం పరిసరాల్లో అనుమతి లేని రాయి క్వారీలు పదుల సంఖ్యలో ఉన్నాయి. రోలుగుంట, రావికమతం, మాకవరపాలెం మండలాల్లో కూడా క్వారీలు అక్రమంగా నడుస్తున్నాయి. అనకాపల్లి మండలంలోని క్వారీల నుంచి నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లు, లారీల్లో బండరాళ్లను తరలిస్తున్నారు. ఒకటి, రెండు ప్రముఖ సంస్థల పేరున ఉన్న లీజు పత్రాల ఆధారంగా నకిలీ వేబిల్లులతో అనధికార క్వారీల నుంచి కంకర, నల్లరాయి రవాణా చేస్తున్నారు. గనులు, రవాణా, పోలీసు శాఖల తనిఖీలు నామమాత్రం కావడం, కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు అండగా వుండడంతో అక్రమ క్వారీల నిర్వాహకుల వ్యాపారం మూడు టిప్పర్లు, ఆరు లారీల చందంగా సాగిపోతున్నది. స్థానికులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. గనుల శాఖ విజిలెన్స్, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు అప్పుడప్పుడు క్వారీల్లో తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నారు. కొన్ని వాహనాలను స్వాధీనం చేసుకొని మొక్కుబడిగా అపరాధ రుసుం విధించి వదిలేస్తున్నారు. అక్రమంగా తరలిపోతున్న దానిలో అధికారులు పట్టుకుంటున్నది పట్టుమని పది శాతం కూడా ఉండడం లేదు.



ఆత్మహత్యయత్నం చేసిన రైతు (ఫైల్)

క్వారీ లారీలను అడ్డుకున్న రైతులు, స్థానిక ప్రజలు

రోజు రోజుకూ క్వారీ యాజమాన్యాలకు, స్థానిక రైతుల మధ్య వివాదాలు తీవ్రతరం అవుతున్నాయి. మా మాట వినండి, మాకు నష్టం చేకూర్చే క్వారీలు ఆపండని బాధిత రైతులు కోరుతున్నా.. మైనింగ్, పోలీస్ శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. స్థానిక కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు అండతో క్వారీ యాజమాన్యాలు చెలరేగిపోతున్నారు. దీంతో రెండు రోజుల క్రితమే క్వారీ లారీలను శరభవరం, రాజన్నపేట, గొల్లపేట, వడ్డిపె గ్రామాల్లో రైతులు అడ్డుకున్నారు. ఆందోళనలు కూడా చేశారు. వారం రోజుల క్రితం వరకూ సుమారు 25 రోజుల పాటు నల్లరాయి రవాణా ఆపిన యజమాన్యం మరలా ఈ రవాణా కొనసాగించింది. దీంతో పై గ్రామాలవారు క్వారీ నిర్వహణ ప్రాంతం సమీపంలో రవాణా ఆపాలి, కొండలు పేల్చడం ఆపాలంటూ యాజమాన్యాన్ని కోరారు. వినకపోవడంతో అడ్డుకున్నారు. తమకు కూటమి ప్రభుత్వ నేతలు అండగా ఉన్నారని బహిరంగంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శరభవరం గ్రామానికి చెందిన జలుమూరి సత్తిబాబు అనే రైతు మానసిక వ్యధతో మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అదేవిధంగా రోలుగుంట నుంచి మాకవరపాలెంలో ఆన్‌రాక్ కంపెనీకి వచ్చే లోడ్ లారీలను స్థానికులు అడ్డుకున్నారు. డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. రోడ్లు దెబ్బతింటున్నాయి.

రోజుకు 1000 ట్రిప్‌లు..

అనకాపల్లి రూరల్ పరిధిలో మార్టూరు, మామిడపాలెం, మావవరం, బౌలువాడ, కుంచంగి, వేట జంగాలపాలెం, వెంకుపాలెం గ్రామాల నుంచి రాంబిల్లి మండలంలో నావెల్ బేస్ ప్రాజెక్టుకు బండరాళ్లు సరఫరా అవుతున్నాయి. అనకాపల్లి రూరల్ ప్రాంతంలో మాకవరం, మామిడిపాలెం, మార్టూరు గ్రామాల్లో, బౌలువాడ, కుంచంగి, వేటజంగాలపాలెం, వెంకుపాలెం గ్రామాల సమీపంలో ఉన్న క్వారీల నుంచి రవాణా చేస్తున్నారు. చోడవరం నియోజకవర్గంలో రోలుగుంట, రావికమతం, కాకినాడ జిల్లాలో రౌతులపూడి, కోటనందూరు మండలాల నుంచి క్వారీ లారీల్లో రవాణా జరుగుతున్నాయి. రోజుకు సుమారుగా 300 నుంచి 350 వరకూ క్వారీ లారీల ద్వారా 1000 ట్రిప్‌లు వెళుతున్నాయి. రోజుకు సుమారు 12,000 నుంచి 13,000 టన్నుల స్టోన్ రవాణా జరుగుతోంది.

ఆమె ఎవరో?

- ఎవరు అంతమొందించారో..
- మూటలో మహిళ శరీర భాగాలు
- కశింకోట మండలం బయ్యవరంలో సంచలనం



శరీర భాగాల మూటను తరలిస్తున్న పోలీసులు

కశింకోట: ఆ మహిళకు సుమారు 35 ఏళ్ల వయసు ఉండవచ్చు.. చేతికి గాజులు.. కాలికి మట్టెలు.. ఆమె వివాహిత అని చెప్పకనే చెబుతున్నాయి.. కొద్ది గంటల క్రితమే హత్య జరిగి ఉండవచ్చని వైద్యులు ధ్రువీకరించారు.. కశింకోట మండలం బయ్యవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై రెండు మందుల మధ్య ఖాళీ స్థలం దొరికిన ఒక మూటలో మొల దిగువ భాగం కాళ్లు, ఒక చేయి ఉన్నాయి.. మంగళవారం ఉదయం స్థానికులు అందించిన సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మూట విప్పి.. ఆ దృశ్యాన్ని చూసి హతాశులయ్యారు. అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి అభిప్రాయం ప్రకారం .. సోమవారం రాత్రి మహిళను హత్య చేసి శరీర భాగాలను ముక్కలుగా కోసి మూటగట్టి సోమవారం రాత్రి తెచ్చి ఇక్కడ పడేసి ఉంటారు. సీఐ అల్లు స్వామినాయుడు తదితర సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని ఆమె సందర్శించారు. మృతురాలి శరీర భాగాలపై వస్త్రాలు గాని, మరే ఆధారాలుగాని లేవు. గాజులు, మట్టెలు మాత్రం దొరికాయి. మిగిలిన మృతదేహ భాగం లభ్యమయితే తప్ప ఎవరో గుర్తించే అవకాశం లేదు. అయితే కాలి భాగంలో ఒక పుట్టు మచ్చ ఉంది. మిగిలిన శరీర భాగాన్ని మరోచోట పడేయడం గాని, పూడ్చి వేయడం గాని చేసి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసు జాగిలం యలమంచిలి మార్గం వైపు వెళ్లింది. మృతదేహం శరీర భాగాలను అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచారు.



సంఘటన స్థలంలో పోలీసు జాగిలం



సీసీ టీవీ పుటేజ్‌లను పరిశీలిస్తున్న విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

8 ప్రత్యేక బృందాల ఏర్పాటు

మహిళ హత్య కేసును ఛేదించడానికి 8 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. అనకాపల్లి ఎస్పీ సెలవులో ఉండటంతో ఆయన ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. సంఘటన స్థలాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచిన శరీర భాగాలను కూడా ఆయన పరిశీలించారు. సీసీటీవీ పుటేజీ, స్థానికుల సమాచారాన్ని విశ్లేషించి నిందితులను త్వరలోనే గుర్తించి అరెస్టు చేస్తామని చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి ఏ విధమైన సమాచారంగాని, అదృశ్యమైన మహిళల వివరాలు గాని తెలిసిన వారు తక్షణమే పోలీసు అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు సెల్ నెంబర్ 9440796088కు గాని, 100, 112 నెంబర్లకు గాని సమాచారాన్ని తెలియజేయాలన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, సీఐలు విజయకుమార్, అశోక్‌కుమార్, కోటేశ్వర రావు, పైడపు నాయుడు, అప్పలరాజు, అప్పల నాయుడు తదితరులు ఉన్నారు.

పోలీసులు గమనించిన గుర్తులివీ..



మృతురాలు ధరించిన గాజులు, మట్టెలు

మూటలో దొరికిన హతురాలి శరీర భాగాల నుంచి పోలీసులు కొన్ని గుర్తులను సేకరించారు. కుడి తొడపై 1.5 అంగుళాల నల్ల పుట్టు మచ్చ ఉన్నట్టు గుర్తించారు. కుడి చేతి మణికట్టుపై టాటూ ముద్ర ఉంది. కాలి వేళ్లకు మట్టెలు ఉన్నాయి. చేతికి నాలుగు గాజులు ధరించినట్లు గుర్తించారు. వీటి ఆధారంగా మృతురాలి వివరాలు తెలిసిన వారు తమకు తెలపాలని పోలీసులు కోరుతున్నారు.

కూటమి కు'తంత్రం'

- మేయర్ పీఠం కోసం కుయుక్తులు
- రంగంలోకి దిగిన ఎంపీలు, ఎమ్మెల్యేలు
- కార్పొరేటర్‌కు రూ.25 లక్షల చొప్పన బేరం
- ససేమిరా అంటున్న వారికి ఎక్కువ ఆఫర్లు
- లొంగని వారికి బెదిరింపులు



డాబాగార్డెన్స్ (విశాఖ):

విశాఖలో కూటమి కుట్రలు తారస్థాయికి చేరుకున్నాయి. ఎలాగైనా మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే దుర్బుద్ధితో తెర వెనుక అప్రజాస్వామిక ప్రయత్నాలు సాగిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవసరమైన సంఖ్యాబలాన్ని కూడగట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ సీపీకి చెందిన కార్పొరేటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు కోట్లాది రూపాయలు సిద్ధం చేశారు. ఒక్కొక్క కార్పొరేటర్‌కు ఏకంగా రూ.25 లక్షలు వెలకట్టి, వారిని కొనుగోలు చేసేందుకు తెగబడినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో కూటమికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం నేరుగా రంగంలోకి దిగడం గమనార్హం. కొందరికి భారీ మొత్తంలో డబ్బు ఆఫర్ చేస్తూ, మరికొందరి వ్యాపారాలను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎవరైనా లొంగకపోతే వారి ఆస్తులను ధ్వంసం చేస్తామని బహిరంగంగానే హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ ఇదే తరహా అప్రజాస్వామిక విధానాలను అవలంబించి స్థానిక సంస్థలను చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు విశాఖ నగర పీఠాన్ని కూడా తమ గుప్పిట్లో పెట్టుకోవాలని కుట్రలు పన్నుతోంది.

గ్రేటర్‌లో బలం లేకపోయినా..

గ్రేటర్‌లో కూటమికి సంఖ్యా బలం లేదు. మహా విశాఖ నగరపాలక సంస్థలోని 98 వార్డులకు కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. ప్రస్తుతం 19వ వార్డు మినహాయిస్తే 97 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వైఎస్సార్ సీపీ 58, తెలుగుదేశం 29, జనసేన 3, సీపీఐ, సీపీఎం, భాజపాకు ఒక్కొక్కరు, నలుగురు స్వతంత్ర కార్పొరేటర్లు గెలుపొందారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను నయానో భయానో తమకు మద్దతు తెలిపేలా స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రలోభాలు, బెదిరింపులకు దిగుతున్నారు. ఇందుకోసం అవసరమైతే క్యాంపు రాజకీయాలకు కూడా సిద్ధమవుతున్నారు. కూటమిలో చేరితే రూ.25 లక్షలు ఇస్తామని ఎర వేస్తున్నట్టు తెలిసింది. అక్కడికీ లొంగకపోతే మరింత ఎక్కువ ఇస్తామని నమ్మబలుకుతున్నారు. వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేయిస్తాం.. వచ్చే ఎన్నికల్లో సీటు మీదే.. ఇలా పలు విధాలుగా లొంగదీసుకునేందుకు శత విధాల ప్రయత్నాలు చేస్తున్నారు.

లొంగని కార్పొరేటర్లకు బెదిరింపులు

కూటమి నేతల ఆఫర్లకు తలొగ్గని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లపై బెదిరింపులు దిగుతున్నారు. మద్దతు తెలపని కార్పొరేటర్లను 'మీ అంతు చూస్తాం'అంటూ కూటమి నేతలు హెచ్చరిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా వార్డుల్లో అభివృద్ధి పనులు జరగనివ్వబోమని, వ్యాపారాలు, ఇతర పనులు సాఫీగా సాగనివ్వమని బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. 'రాష్ట్రంలో మా ప్రభుత్వమే ఉంది. మా నాయకుడు ఇప్పటికే వైఎస్సార్ సీపీకి ఎటువంటి పనులు చేయకూడదని ఆదేశాలు జారీ చేశారు.' అంటూ కూటమి నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్టీకి ద్రోహం చేయలేను

'నాకు వైఎస్సార్ సీపీ రాజకీయ భిక్ష పెట్టింది. పార్టీకి ద్రోహం చేయలేను. ఇప్పటికే జనసేన, టీడీపీల నుంచి నాకు ఫోన్లు వచ్చాయి. వాళ్లు ఎన్నో ప్రలోభాలు పెట్టారు. వచ్చే ఎన్నికల్లో నా వార్డు నుంచి నేనే కార్పొరేటర్‌గా ఉంటానని హామీ ఇచ్చారు. నా వార్డు అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని చెప్పారు. వార్డులో జనసేన, టీడీపీ కార్యకర్తలు నా వెంటే ఉంటారని తెలిపారు. అంతేకాదు నాకు మరిన్ని పదవులు ఇస్తామని ఎన్నో వాగ్దానాలు చేశారు. డబ్బు కూడా ఇస్తామన్నారు.'అంటూ ఓ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

లైన్ ఇన్‌స్పెక్టర్‌కు ఘనసత్కారం



మాణిక్యాలరావు దంపతులను సత్కరిస్తున్న డీఈ, ఇతర సిబ్బంది

మాకవరపాలెం : జాతీయ అవార్డు అందుకున్న విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ బొంతు మాణిక్యాలరావును ఘనంగా సత్కరించారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో రెండున్నరేళ్లుగా లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మాణిక్యాలరావు జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 4న ఢిల్లీలో కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి చేతుల మీదుగా మాణిక్యాలరావు అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది సబ్ స్టేషన్ వద్ద సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు దంపతులను నర్సీపట్నం డీఈ రామకృష్ణ, ఏడి త్రినాథరావు, స్థానిక ఏఈ బాలకృష్ణ, ఇతర సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐఎస్‌ఎఫ్ సైకిల్ ర్యాలీ ప్రారంభం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న పోర్ట్ చైర్మన్ అంగముత్తు

ఏయూక్యాంపస్: తీరప్రాంత భద్రత ప్రాధాన్యతను వివరిస్తూ సీఐఎస్‌ఎఫ్ చేపట్టిన సైకిల్‌థాన్‌ను మంగళవారం ఉదయం విశాఖ పోర్ట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు జెండా ఊపి ప్రారంభించారు. విశ్వప్రియ ఫంక్షన్ హాలు వద్ద ఈ కార్యక్రమం జరిగింది. శ్రీకాకుళం నుంచి సైకిల్‌థాన్ బృందం సోమవారం విశాఖ చేరుకున్న విషయం తెలిసిందే. తిరిగి విశాఖ నుంచి మంగళవారం తమ ప్రయాణాన్ని ప్రారంభించింది. సైకిల్‌థాన్‌కు మద్దతుగా పలువురు చిన్నారులు సైకిళ్లపై వారి వెంట కొంత దూరం ప్రయాణించారు. కార్యక్రమంలో పీపీఏ సెక్రటరీ టి.వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్న గుండె మండింది..

దేవరాపల్లి: విత్తు నాటాడు.. నీరు పోశాడు.. బాగా ఎదగాలని ఎరువులు వేశాడు.. పండిన చెరకు గడలను చూసి మురిసిపోయాడు.. లాభాల తీపి ఊహించుకొని ఆనందపడ్డాడు.. కానీ పెట్టుబడులకు సరిపడా గిట్టుబాటు ధర లేకపోవడం, గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో సక్రమంగా క్రషింగ్ జరపకపోవడంతో కలత చెందిన రైతు తన పంటకు తానే నిప్పంటించుకున్నాడు. దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామానికి చెందిన రైతు రొంగలి వెంకటరావు కన్నీటి కథ ఇది. కె.కోటపాడు మండలం మేడిచెర్ల గ్రామ రెవెన్యూ పరిధిలో వెంకటరావు 80 సెంట్ల విస్తీర్ణంలో చెరకు పంటను సాగు చేస్తున్నాడు. పంట కోత దశకు చేరుకున్న తరుణంలో గిట్టుబాటు ధర లేకపోగా, గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో తరచూ క్రషింగ్ నిలిచిపోతుండటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ పంటను ఫ్యాక్టరీకి తరలించినా సకాలంలో పేమెంట్లు రాక.. కనీసం కోత కూలి, రవాణా చార్జీలు చెల్లించే పరిస్థితి లేదని భావించిన రైతు గత్యంతరం లేక బాధతో పంటకు నిప్పంటించాడు. గతంలో 50 టన్నుల వరకు ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసేవాడినని, అప్పట్లో ప్రతి 15 రోజులకోసారి పేమెంట్లు ఇచ్చేవారని వెంకటరావు తెలిపాడు.

ప్రస్తుతం చెరకుతో రోజుల తరబడి కాటా, ఫ్యాక్టరీ వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీంతో చెరకు ఎండిపోయి బరువు తగ్గి మరింత నష్టం వాటిల్లుతుందని, సాగు చేసిన పంటకు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో నిప్పు పెట్టానని చెప్పాడు. ఈ చర్యతోనైనా కూటమి ప్రభుత్వానికి రైతుల కష్టాలపై కనువిప్పు కలగాలన్నాడు.



బాధిత రైతు రొంగలి వెంకటరావుతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి

కలెక్టర్ ఆదేశాలతో జేసీ విచారణ

రైతు స్వయానా చెరకు తోటకు నిప్పు పెట్టిన ఘటనపై కలెక్టర్ విజయ కృష్ణన్ స్పందించి విచారణకు ఆదేశించారు. ఆమె ఆదేశాలతో జేసీ జాహ్నవి గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఎండీ, రెవెన్యూ అధికార్లతో కలిసి సంఘటన ప్రాంతాన్ని సందర్శించి బాధిత రైతు వెంకటరావుతో మాట్లాడారు. చెరకు పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు ఫ్యాక్టరీ సక్రమంగా క్రషింగ్ జరపక పోవడం పట్ల ఆవేదనతో తానే పంటకు నిప్పు పెట్టినట్లు రైతు తెలియజేశారు. వెంటనే రైతుకు జరిగిన పంట నష్టంపై నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికార్లను జేసీ ఆదేశించారు. పంటను వెంటనే ఫ్యాక్టరీకి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఫ్యాక్టరీ ఎండీని ఆదేశించారు. ఫ్యాక్టరీ పరిధిలో చెరకు మొత్తం తీసుకోవడం జరుగుతుందని, 2600 ఎకరాలలో చెరకు క్రషింగ్ రెండు వారాలలో పూర్తి చేస్తామన్నారు. చెరకు బకాయిలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు. జేసీ వెంట దేవరాపల్లి, కె.కోటపాడు రెవెన్యూ అధికార్లు, స్థానిక ఏవో వై. కాంతమ్మ, కొత్తపెంట సర్పంచ్ రొంగలి వెంకటరావు తదితర్లు ఉన్నారు

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే చెరకు రైతుకు ఈ దుస్థితి : సీపీఎం నేత వెంకన్న

కొత్తపెంటలో చెరకు రైతు తన పంటకు నిప్పు అంటించుకున్నారని విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధిత రైతును ఓదార్చారు.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు రైతులకు ఈ దుస్థితి దాపురించిందన్నారు. ఎన్నికలకు ముందు ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని చెప్పిన ఎంపీ సీఎం రమేష్, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు గెలుపొందాక కన్నెత్తి చూడకపోవడం దారుణమన్నారు. ప్రధాన మోడి వద్ద తనకు పలుకుబడి ఉందని ఊదరగొట్టిన ఎంపీ సీఎం రమేష్ ఫ్యాక్టరీని ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

విరాళ సొమ్ము దోచుకోవాల్సిన అవసరం లేదు

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఆలయ నిర్మాణం
- స్పీకర్ ఆరోపణలను తిప్పికొట్టిన మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : నూకాలమ్మ ఆలయ నిర్మాణానికి విరాళంగా ఇచ్చిన నిధులను దోచుకోవాల్సిన అవసరం తనకు లేదని, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హితవు పలికారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవుడి సొమ్ము తినాలని ఎవరూ అనుకోరన్న విషయాన్ని స్పీకర్ గ్రహించాలన్నారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి టీడీపీ ప్రభుత్వ హయాంలో కంట్రిబ్యూషన్ కింద రూ.10 లక్షలు చెల్లించారు. ఎన్నికలు మూడు నెలలు ఉండగా ఆలయ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టర్ అప్పలనాయుడు 2019 డిసెంబరులో నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.40 లక్షల



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

వ్యయంతో నూతన గుడిని నిర్మిస్తే తానే కట్టానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 లక్షలు, కంట్రిబ్యూషన్ రూ.10 లక్షలు మొత్తం రూ.50 లక్షలతో ఆలయ నిర్మాణం చేపట్టామన్నారు. ఆలయ పనులు అసంపూర్తిగా ఉండడంతో నూకాలమ్మ ఆలయానికి సీఎంఆర్ అధినేత మావూరు వెంకటరమణను ఆర్థిక సాయం కోరడం జరిగిందన్నారు. సీఎంఆర్ అధినేత అమ్మవారి ఆలయానికి రూ.10 లక్షలు విరాళం ప్రకటించారు. సీఎంఆర్ సంస్థ వ్యాపారంతో పాటు అనేక సేవా కార్యక్రమాలకు విరాళాలు ద్వారా తోడ్పాటునందించడంతో పాటు వారి సంస్థలో ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ఇచ్చిన విరాళం నిధులను దోచుకోవాల్సిన అవసరం తనకు లేదన్నారు. సీఎంఆర్ సంస్థ ప్రకటించిన రూ.10 లక్షల విరాళానికి సంబంధించి లావాదేవీలన్ని సీఎంఆర్ సంస్థ మేనేజర్, నూకాలమ్మ టెంపుల్ చైర్మన్ ధనిమిరెడ్డి నాగు మధ్య జరిగాయన్నారు. ఏ పనికి ఎంత ఖర్చు పెట్టారన్నది పక్కాగా వివరాలు ఉన్నాయన్నారు. సీఎంఆర్ సంస్థ, చైర్మన్ మధ్య లావాదేవీలు జరిగితే తనపై బురదజల్లడం స్పీకర్‌కు తగదన్నారు. నూకాలమ్మ ఆలయంలో నూతన విగ్రహం ఏర్పాటుకు ఎంత అవుతుందని శిల్పిని సంప్రదిస్తే రూ.లక్షా 50 వేలు అవుతుందన్నారు. అమ్మవారి విగ్రహం కోసం తాను స్వయంగా రూ.లక్ష విరాళంగా ఇచ్చి విగ్రహం తయారు చేయించానన్నారు. విరాళాలను అకౌంట్‌కు ఎలా జమ చేస్తారని ప్రశ్నించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పిందే నిజమైతే ఇదే సీఎంఆర్ అధినేత సుమారు రూ.20 లక్షల విరాళంతో నర్సీపట్నం శ్మశాన వాటికను సుందరీకరణ చేశారు. ఆ నిధులను మున్సిపాలిటీ అకౌంట్‌కు ఎందుకు జమ చేయలేదని మాజీ ఎమ్మెల్యే గణేష్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమల్లో రక్షణ వ్యవస్థలపై నిరంతర పర్యవేక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

- జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

సాక్షి, అనకాపల్లి : పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా కర్మాగారాల లోపల, వెలుపల కూడా రక్షణ వ్యవస్థలను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా సంక్షోభ నిర్వహణ కమిటీ చైర్మన్ విజయ కృష్ణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఫ్యాక్టరీలలో ఏర్పాటు చేసిన రక్షణ వ్యవస్థల గూర్చి సమీక్ష చేశారు. ఫ్యాక్టరీ లోపల, వెలుపల కూడా రసాయనాలు లీకేజీలను గుర్తించే సెన్సార్లను అమర్చాలని తెలిపారు. ఫ్యాక్టరీలలో అమర్చిన రక్షణ పరికరాలకు, జాతీయ సేఫ్టీ కౌన్సిల్ ఆమోదం ఉండాలని తెలిపారు. ఫ్యాక్టరీ వెలుపల ప్రమాదాలకు సంబంధించిన రక్షణ వ్యవస్థల నివేదికలను 20 రోజుల్లో అందజేయాలని తెలిపారు. కంపెనీలలో శిక్షణ పొందిన కార్మికులను నియమించుకోవాలని ఆదేశించారు. జిల్లాలో గల 12 రసాయన కర్మాగారాల్లో మాక్ డ్రిల్‌ను కూడా నిర్వహించాలని సూచించారు.

రసాయనాలను రవాణా చేసే వాహనాలకు కూడా రసాయనాల లీకేజీలను గుర్తించే సెన్సార్లు అమర్చాలని తెలిపారు. సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయిషా, ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టరు జె. శివశంకర్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జి.వి.ఎస్.ఎస్. నారాయణ, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజారావు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాండవ కాలువల అభివృద్ధికి భూమిపూజ

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో తాండవ రిజర్వాయరు నీరు శివారు ఆయకట్టుకు అందించాలంటే కాలువలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తేనే సాధ్య పడుతుందని ప్రాజెక్టు డీఈ అనురాధ అన్నారు. తాండవ ఆయకట్టు పరిధిలో నాతవరం నర్సీపట్నం మండలాల మధ్య బలిఘట్టం మేజరు కాలువను అభివృద్ధికి రూ.11.70 లక్షలతో మంగళవారం భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ తాండవ ఆయకట్టు పరిధిలో కాలువలు అభివృద్ధి చేసేందుకు 18పనులు రూ.2.10 కోట్లతో టెండర్లు ఖరారు చేశామన్నారు. వాటిలో ప్రస్తుతం కొన్ని పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. మిగతా పనులు కూడా త్వరలో ప్రారంభించి సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ జోగుబాబు, తాండవ ప్రాజెక్టు నాతవరం సెక్షన్ జేఈ శ్యామ్‌కుమార్, నీటి సంఘాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ, కమిటీ చైర్మన్ సత్యనారాయణ

సైక్లోథాన్‌కు ఘనస్వాగతం



సీఐఎస్‌ఎఫ్ సైక్లోథాన్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



యలమంచిలి చేరుకున్న సీఐఎస్‌ఎఫ్ సైక్లోథాన్-2025

యలమంచిలి రూరల్: సీఐఎస్‌ఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం 2025 సందర్భంగా తీర ప్రాంత 'సైక్లోథాన్-2025' మంగళవారం యలమంచిలి చేరుకుంది. తీరప్రాంత భద్రత గురించి అవగాహన పెంపొందించడం, స్మగ్లింగ్, మాదక ద్రవ్యాల రవాణా వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగుతోంది. మంగళవారం పట్టణానికి చేరుకున్న సైక్లోథాన్‌కు విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈనెల 31వ తేదీన కన్యాకుమారి చేరుకోవడంతో సైక్లోథాన్ 2025 ముగుస్తుంది. కార్యక్రమంలో కమాండెంట్ సతీష్ కుమార్ బాజ్‌పాయ్, డిప్యూటీ కమాండెంట్ వికాష్ కుమార్ సాహు, సహాయ కమాండెంట్ అమిత్ కుమార్, ఇన్‌స్పెక్టర్ కె.కుమార్, మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, తహసీల్దార్ కె.వరహాలు, పట్టణ ప్రణాళికాధికారి వై.శ్రీలక్ష్మి, పట్టణ ఎస్సై కె.సావిత్రి, పీడీ వై.పోలిరెడ్డి, వీరభద్రరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీఐపీఈటీ సహకారంతో ఎన్టీపీసీలో ఉపాధికి శిక్షణ



చెక్ అందిస్తున్న ఈడీ సమీర్‌శర్మ

పరవాడ: విజయవాడలోని సీఐపీఈటీ సహకారంతో సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం కల్పిస్తున్న ఉపాధి శిక్షణ కార్యక్రమాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ఈడీ సమీర్‌శర్మ కోరారు. విజయవాడలోని సీఐపీఈటీని ఈడీ సమీర్‌శర్మ, సంస్థ అధికారులు మంగళవారం సందర్శించారు. శిక్షణ పొందుతున్న నిరుద్యోగులను కలిసి, వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈడీ సమీర్ శర్మ మాట్లాడుతూ సీఐపీఈటీ సహకారంతో సింహాద్రి ఎన్టీపీసీ శతశాతం ఉద్యోగ నియామక హామీపై మెషిన్ ఆపరేటర్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్, మెషిన్ ఆపరేటర్-ఇంజెక్షన్ మోల్డింగ్‌లో ఆరు నెలల శిక్షణ అందిస్తోందన్నారు. ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌లలో 120 మంది నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించామన్నారు. ప్రస్తుతం మరో 60 మంది నిరుద్యోగులు శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు.

ఆదివాసీలపై దమనకాండను ఆపాలి

సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్

సీతంపేట: దేశంలో అభివృద్ధి నమూనా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ప్రముఖ సామాజిక వేత్త, ఆచార్య జి.హరగోపాల్ అన్నారు. 'ఆపరేషన్ కగార్'పేరుతో ఆదివాసీలపై జరుగుతున్న దమనకాండను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ సంపద కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని, అభివృద్ధిలో సమానత్వం లేదన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో అభివృద్ధి పేరుతో అణచివేత జరుగుతోందని ఆరోపించారు. ఎవరు వ్యతిరేకించినా రాష్ట్రంలో ఖనిజాల తవ్వకాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తామని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ప్రకటించారని.. బస్తర్ ప్రాంతంలో పోలీస్ క్యాంపుల వెనుక అక్కడి ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్ర ఉందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో కొన్ని ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, ఆ మేరకు ఆదివాసీల వ్యతిరేకతతో వేదాంత కంపెనీ వెనక్కి వెళ్లిపోయిందని గుర్తు చేశారు. మావోయిస్టుల ఏరివేత వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమేనన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు వి.ఎస్.కృష్ణ మాట్లాడుతూ మావోయిస్టు ఉద్యమాన్ని రాజకీయంగా పరిష్కరించే దృష్టి ప్రభుత్వాలకు లేదన్నారు. ప్రజల హక్కులకు లోబడి మావోయిస్టులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని, దీనికి విరుద్ధంగా బూటకపు ఎన్‌కౌంటర్లు, గ్రామాలను ధ్వంసం చేయడం, లైంగిక దాడులు, వ్యక్తుల అదృశ్యం వంటి చర్యలకు పాల్పడుతూ ఉద్యమాన్ని క్రిమినలైజ్ చేశారని విమర్శించారు. హక్కుల సంఘాల పోరాటంతో 2011లో కోర్టు సల్వాజుడుం రాజ్యాంగ విరుద్ధమని ఇచ్చిన తీర్పుతో దానిని రద్దు చేశారన్నారు. ఆ తర్వాత గ్రీన్‌హంట్, ప్రస్తుతం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా, పెద్ద ఎత్తున రహదారులు నిర్మిస్తూ వనరుల దోపిడీకి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సదస్సులో పర్యావరణవేత్త గంజివరపు శ్రీనివాస్, ఆదివాసీ హక్కుల నేత రామారావు దొర, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, న్యాయవాది వృద్ధుల కల్యాణ రామా రావు, వామపక్ష నేతలు ఎం.పైడిరాజు, వై.కొండయ్య, డి.లలిత, ఎ.విమల, పద్మ, ఎం. లక్ష్మి, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వడ్డాది వెంకన్నకు శఠగోపం?

- భక్తులు సమర్పించిన ఆభరణాల వివరాలు వెల్లడించని ఆలయ అధికారులు
- హుండీలో వేసిన బంగారు, వెండి వస్తువుల గురించి ప్రశ్నిస్తున్న భక్తులు

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి గాంచిన వడ్డాది వెంకన్న కల్యాణోత్సవాలు ఈనెల 15వ తేదీతో ముగిశాయి. ఈ ఉత్సవాల సందర్భంగా భక్తులు హుండీలో వేసిన కానుకలు, నగదును ఈనెల 17న లెక్కించారు. అయితే భక్తులు వేసిన బంగారు, వెండి వస్తువులు కనిపించలేదని సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దీనికి సంబంధించి ఆసక్తికరమైన విషయాలు మంగళవారం వెలుగుచూశాయి. వడ్డాది గ్రామానికి చెందిన రమణ అనే భక్తుడు తనకు సంతానం కలిగితే నిలువు దోపిడీ ఇస్తానని వేంకటేశ్వరస్వామికి గతంలో మొక్కుకున్నారు. ఆయనకు ఏడాది క్రితం సంతానం కలిగింది. అయితే గత ఏడాది తల్లి మృతి చెందడంతో మైల కారణంగా ఈ ఏడాది మొక్కు చెల్లించుకున్నారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఈ నెల 12వ తేదీన రమణ సతీసమేతంగా స్వామివారిని దర్శించుకొని, తులంన్నర బంగారు, 9 తులాల వెండి ఆభరణాలు, 3 కిలోల చిల్లర నాణేలను స్వామివారి హుండీలో వేశారు. కాగా సోమవారం హుండీ లెక్కింపులో ఈ బంగారం, వెండి కనిపించలేదని భక్తుడు రమణ మంగళవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈ విషయం గురించి ఆలయం ఈవో శర్మను వివరణ కోరగా.. హుండీలో ఉన్నవి రోల్డ్‌గోల్డ్‌గా అనిపించి లెక్కించలేదని, బుధవారం హుండీలను తెరిచి, బంగారు పనివారిని పిలిచి ఆభరణాల నాణ్యత పరిశీలిస్తామని వివరణ ఇచ్చారు. ఆలయంలో గల హుండీలో బంగారం, వెండి లేకపోవడంతో పలువురు ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు హుండీలో ఇంకా ఏ మేర బంగారు, వెండి కానుకలు సమర్పించారోనని చర్చించుకుంటున్నారు.

ఇందిరా మార్కెట్‌లో చోరీ



చోరీ జరిగిన షాపును పరిశీలిస్తున్న పోలీసులు

నర్సీపట్నం : మున్సిపాలిటీ ఇందిరా మార్కెట్‌లోని శ్రీనివాస్ ట్రేడింగ్ కిరాణా దుకాణంలో ఈ నెల 17వ తేదీ అర్ధరాత్రి చోరీ జరిగింది. షాపు పైకప్పు సిమెంట్ రేకును కట్ చేసి లోపలికి ప్రవేశించి కిరాణా సామాన్లతో పాటు కౌంటర్‌లోని కొంత నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. షాపు యజమాని అంజూరి శ్రీనివాసరావు ఉదయం షాపు తెరిచి చూసేసరికి పైకప్పు రంధ్రం చేసి ఉండడంతో షాపులోని ఆయిల్ డబ్బాలు, సబ్బులు, కిరాణా సామాన్లు పట్టుకుపోవడాన్ని గుర్తించి లబోదిబోమన్నాడు. మొత్తం కిరాణా సామాన్లు, నగదు కలిపి రూ.లక్ష వరకు చోరీ జరిగిందని షాపు యజమాని తెలిపాడు. రెండు నెలల కాలంలో వరుసగా మార్కెట్‌లో నాలుగు దొంగతనాలు జరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. చోరీలను అరికట్టి వ్యాపారులకు రక్షణ కల్పించాలని వారు వేడుకున్నారు. చోరీపై టౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రీ మృతి

నర్సీపట్నం : రామలక్ష్మీపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చెట్టుపల్లి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ ఎం.సతీష్(32) మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ రాజారావు తెలిపారు. మృతుడు సతీష్, అదే గ్రామానికి చెందిన ఎం.గోవిందుతో కలిసి తాపీ పని ఒప్పుకునేందుకు స్కూటీపై నర్సీపట్నం వచ్చారు. తిరిగి వెళ్తుండగా అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. సతీష్ తీవ్రంగా గాయపడగా, గోవింద్‌కు చిన్నచిన్న గాయాలయ్యాయి. 108 వాహనంలో సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. సతీష్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సతీష్ మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి పట్టివేత

చోడవరం: ఆరేళ్లుగా పరారీలో ఉన్న గంజాయి స్మగ్లర్‌ను ఎట్టకేలకు చోడవరం పోలీసులు పట్టుకున్నారు. 2019లో చోడవరం సమీపంలో ఇక్కడి పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. అప్పట్లో ఈ కేసులో నిందితుడిగా ఉన్న ముంచంగిపుట్టు మండలం గేసువుపోలిపుట్టు గ్రామానికి చెందిన గడుతుల పరశురామ్ అనే వ్యక్తి పరారయ్యాడు. ఆరేళ్లుగా పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్న పరశురామ్‌ను మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ అప్పలరాజు చెప్పారు.

సబ్బవరంలో భారీగా గంజాయి పట్టివేత

- ఏవోబీ నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తుండగా.. రూ.18.19 లక్షల విలువైన 363.8 కిలోల గంజాయి స్వాధీనం
- 2 కార్లు, ఐదు మొబైళ్లు, రూ.50 వేలు నగదు సీజ్
- ఏడుగురి అరెస్ట్, ముగ్గురు పరార్



సీఐ పిన్నింటి రమణతో కలిసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్



పట్టుబడిన గంజాయి, కార్లు, నిందితులతో డీఎస్పీ విష్ణు స్వరూప్, సబ్బవరం పోలీసులు

సబ్బవరం: మండలంలోని ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారిపై బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద కారులో పెద్ద ఎత్తున తరలిస్తున్న గంజాయిని సబ్బవరం పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ పిన్నింటి రమణతో కలిసి డీఎస్పీ వల్లెం విష్ణుస్వరూప్ మీడియాకు వివరాలు వెల్లడించారు.

ఆంధ్ర-ఒడిశా బోర్డర్‌లో ఏజెన్సీ ప్రాంతం నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రూ.18.19 లక్షల విలువ చేసే 363.8 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ పిన్నింటి రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ సింహాచలం తన సిబ్బందితో కలిసి గంజాయి తరలిస్తున్న కారుతో పాటు పైలెట్ వాహనంగా వస్తున్న మరో కారును తనిఖీ చేసి, గంజాయిని పట్టుకున్నారు. రెండు కార్లను సీజ్ చేశారు. 7గురిని అదుపులోకి తీసుకోగా, మరో ముగ్గురు పరారయ్యారైనట్లు తెలిపారు. వారి నుంచి రూ.50 వేలు నగదు, 5 సెల్ ఫోన్లతో కలిపి ఈ కేసులో మొత్తం రూ.57.10 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఏవోబీ బోర్డర్‌లో కొనుగోలుచేసి చింతపల్లిలో లోడ్ చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు తెలిసిందన్నారు. గంజాయి తరలింపులో వినియోగించిన వాహనాలు తప్పుడు రిజిస్ట్రేషన్ నంబర్లతో ఉన్నాయని, వీటిపై దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు. పట్టుబడిన వ్యక్తుల్లో ఏఎస్ఆర్ జిల్లాకు చెందిన వారు ఆరుగురు, ఒడిశాకు చెందిన వ్యక్తి ఒకరు ఉన్నారు. ఏ1గా సామిరెడ్డి విజయ్(31), ఏ2 వంతల హరీష్‌బాబు(30), ఏ3 మాడబత్తుల అరుణ్‌కుమార్(38), ఏ4 సాగర్ శివాజీ గోపనీ(32), ఏ5 కొర్రా మహేష్‌బాబు(32), ఏ6 ఎన్.రమణ(40), ఏ7గా సరమండ అనిల్‌కుమార్(25)లపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐలు సింహాచలం, టి.దివ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా పోలిపల్లెమ్మ పండగ



పోలిపల్లెమ్మ తల్లి

తుమ్మపాల: మండలంలోని రేబాకలో పోలిపల్లెమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి పూజలు చేశారు. పలువురు గ్రామస్తులు అగ్నిగుండాలు తొక్కి నూతన వస్త్రాలు, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఏడాదికి ఒక సారి జరిగే పెద్ద పండగ కావడంతో ఊరంతా చుట్టాలతో సందడిగా మారింది. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయంతో పాటు ఊరంతా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన స్టేజీ ప్రోగ్రాంలలో ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

డొంకమాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



డొంకమాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న రత్నాకర్, భక్తులు

అనకాపల్లి టౌన్: మండలంలోని తగరంపూడి గ్రామంలో డొంకమాంబిక అమ్మవారి పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నడిపల్లి తిరుపతి రాజు, బొడ్డపాటి చిన రాజారావు, నందవరపు కుమార్, ఇంటి త్రినాథ్, బుద్ద శివ నాయుడు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలి

అనకాపల్లి టౌన్: మండలంలో బడి మానేసిన పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ పిల్లలు బడుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. జయ ప్రకాష్ సూచించారు. మండల విద్యా కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి-2 ఎస్. కోటేశ్వరరావు, లక్ష్మి, ఆర్పీలు ఎస్. శంకరరావు, ఎంపీఎస్ పద్మజ, నీలవేణి, పి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

31లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

కశింకోట: మండలంలోని రేషన్ కార్డుదారులంతా సంబంధిత చౌక ధరల డిపోలకు వెళ్లి ఈ నెల 31లోగా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు కోరారు. 5 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగి రేషన్ కార్డులో పేరున్న వారు రేషన్ డీలర్ల వద్ద గల ఈకేవైసీ పెండింగ్ జాబితాను పరిశీలించి ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ చేయించుకోకుంటే ఏప్రిల్ 1 నుంచి సంబంధిత రేషన్ కార్డులపై సరకులు పంపిణీ జరగదన్నారు. ఈ విషయాన్ని గుర్తించి తక్షణమే ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 6,207 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,900	4,460
మొదటి రకం	3,790	4,070
రెండో రకం	3,240	3,880
మూడో రకం	2,940	3,220

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్	:రాజా
ఆఫీసర్ ఆన్ డ్యూటీ	:సత్యనారాయణ స్క్రీన్-1
యుగానికి ఒక్కడు	:సత్యనారాయణ స్క్రీన్-2
కోర్ట్	:పర్తిసాయి
దిల్‌రూబా	:షిర్డీసాయి
థౌజండ్ వాలా	:వెంకటేశ్వర(ఉదయం)
న్యూ పోలీస్ స్టోరీ	:వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు)
తండేల్	:శ్రీసత్య
ఛావా	:రామచంద్ర

అమ్మవారికి.. నీడ కరువాయె

రోడ్డున పడ్డ సత్తెమ్మ తల్లి విగ్రహాలు

ఆలయ స్థలాన్ని కబ్జా చేసిన అక్రమార్కులు

జాతీయ రహదారి విస్తరణలో ఆలయం కూల్చివేత

పట్టించుకోని అధికారులు, పాలకులు



విగ్రహాలను ఆనుకుని నిర్మించిన అనధికార నిర్మాణం

తుమ్మపాల: అనకాపల్లి – ఆనందపురం జాతీయ రహదారి ఆరు లేన్ల విస్తరణలో భాగంగా శంకరం రెవెన్యూ పరిధి సత్తెమ్మపేట వద్ద గల సత్తెమ్మ తల్లి ఆలయాన్ని కూల్చేసి ఏడేళ్లు కావస్తున్నా అటు అధికారులు గాని, ఇటు పాలకులు గాని పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆలయాన్ని తొలగించి ఆలయంలోని సత్తెమ్మ తల్లి విగ్రహాలను పక్కనే ఉన్న సిమెంట్ రోడ్డుపై **వదిలేసారు.** అప్పటి నుంచి ఇప్పటి వరకు **ఎక్కడ పెట్టిన** విగ్రహాలు అక్కడే ఎండకు ఎండుతూ, **వానకు** తడుస్తు బొమ్మల వలే రోడ్డుపై దర్శనమి**స్తున్నాయి.**

ఆలయ స్థలం కబ్జా..

పట్టించుకోని అధికారులు, పాలకులు..

మూడు గ్రామాల పెద్దలు, అధికారుల నిర్లక్ష్యంతో ఆలయ నిర్మాణం నిలిచిపోయింది. ఏడేళ్లుగా అమ్మవారి విగ్రహాలు రోడ్డున పడి ధ్వంసం అవుతున్నాయి. ఇదిలా ఉంటే అమ్మవారి ఆలయం వద్ద ఉన్న స్థలాన్ని అక్రమార్కులు చేజిక్కించుకుంటున్నారు. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాన్ని రాజకీయ నాయకుల అండతో అక్కడే ఉన్న స్థానికులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారు. లోతుగా ఉన్న స్థలాన్ని గ్రావెల్‌తో కప్పి క్రమక్రమంగా ఇంటి స్థలాలుగా మార్చేస్తున్నారు. ఆక్రమణలను సక్రమం చేసే విధంగా రెవెన్యూ, పంచాయతీ అధికారులు కళ్లు మూసుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమించినప్పుడు వదిలేసి నిర్మాణాలు ప్రారంభమయ్యాక నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని అంటున్నారు.

ఏడేళ్లుగా నిలిచిపోయిన జాతర..

పల్లెసీమల్లో ఎక్కడైనా సత్తెమ్మ తల్లి అమ్మవారు సాధారణంగా గ్రామ పొలిమేరల్లోనే దర్శనం ఇస్తుంటారు. ఇక్కడ అమ్మవారి ఆలయం కూడా మూడు గ్రామాల సరిహద్దు అయిన అనకాపల్లి, శంకరం, బట్లపూడి గ్రామాల పొలిమేర వద్ద ఉండటంతో అన్ని గ్రామాల ప్రజలు కలిసి ప్రతి ఏటా కార్తీకమాసంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించేవారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఆలయాన్ని కోల్పోవడం, అమ్మవారి విగ్రహాలు, ప్రతిమలు చెల్లాచెదురు కావడంతో అమ్మవారిని పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. దీంతో ప్రతి ఏటా నిర్వహించే ఉత్సవం నిలిచిపోయింది. రోడ్డు విస్తరణలో తొలగించిన ఆలయానికి సంబంధించి నష్టపరిహారంపై స్పష్టత లేకపోవడంతో ఆలయ పునర్నిర్మాణం జరగలేదు.



రోడ్డున పడి ఉన్న సత్తెమ్మ తల్లి విగ్రహాలు

తక్షణమే ఆలయం నిర్మించాలి..



మా గ్రామ శివారు సత్తెమ్మపేట వద్ద ఉన్న సత్తెమ్మతల్లి ఆలయాన్ని తక్షణమే నిర్మించాలి. ఆలయాన్ని కూల్చి ఇన్నేళ్లయినా నిర్మించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అమ్మవారి విగ్రహాలు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నాయి. ఆలయం కూల్చివేతకు సంబంధించి జాతీయ రహదారి ఇచ్చిన నష్టపరిహారం ఏమైపోయిందో నేటికీ తెలియదు. ఇప్పటికైనా ఆలయాన్ని నిర్మించాలి.

– వసుపులేటి చంద్రశేఖర్, శంకరం.

అందరికీ బాధ్యత ఉంది..



సత్తెమ్మ తల్లి అమ్మవారి విగ్రహాలు రోడ్డుపై పడి ఉండటం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. ఇక్కడ అమ్మవారికి కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించి భవనాలు నిర్మించడం చాలా దారుణం. దీనిపై అధికారులు, పాలకులు దృష్టి సారించాలి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని అమ్మవారి స్థలాన్ని రక్షించడంతో పాటు ఆలయ నిర్మాణానికి పూనుకోవాలి.

– కొణతాల హరినాథ్‌బాబు, అనకాపల్లి.

విద్యుత్ మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి



డీఈ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

అనకాపల్లి టౌన్: విద్యుత్ మీటర్ రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గం చూపించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు అన్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో డీఈ రాజశేఖర్‌కు విద్యుత్ రీడర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోతారని, వీరందరిని సబ్ స్టేషన్లలో అర్హత ప్రకారం షిఫ్ట్ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సబ్ డివిజన్ పరిధిలో బ్రేక్ డౌన్ గ్యాంగ్ వర్కర్లుగా నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీటర్ రీడర్లు సీహెచ్ చలపతి, బి. శ్రీనివాసరావు, పి. తులసి, పి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణలో రెల్లి కులానికి అన్యాయం

నర్సీపట్నం: ఎస్సీ వర్గీకరణలో అణగారిన రెల్లి కులానికి అన్యాయం జరిగేలా ప్రభుత్వం వ్యవహరించిందని రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి పాపారావు పేర్కొన్నారు. రెల్లి కులానికి ఒక శాతం రిజర్వేషన్ కల్పించడం అన్యాయమన్నారు. రెల్లి వాటి ఉప కులాల స్థితిగతులను పునరాలోచన చేసి రెల్లి కులాలకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం మరోసారి ఆలోచన చేసి రెల్లి కులస్తుల వాటా పెంచేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

అనకాపల్లి టౌన్: మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని రూరల్ ఎస్‌ఐ నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు విద్యార్థి-యువతపై ప్రభావం అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ముందుగా విప్లవ వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా, అలవాటు వారితో మాన్పించే ప్రయత్నం చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విప్లవ వీరులు భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల జీవితాలను ఆదర్శంగా తీసుకుని జీవితంలో విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణీంద్ర కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



విప్లవ వీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు, విద్యార్థులు

సంతల ఆశీళ్ల వేలం పాట



పంచాయతీ ప్రాంగణంలో సంతల ఆశీలు వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

కశింకోట: స్థానికంగా నిర్వహించే వారం, రోజువారీ సంతలకు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఆశీళ్ల వేలం పాట నిర్వహించగా గతం కంటె రూ.47,500 ఆదాయం పెరిగింది. రోజువారీ సంతకు ఆదాయం ఎక్కువ పెరగ్గా, వారపు సంతకు నామ మాత్రంగా పెరిగింది. రోజువారీ సంతకు గడచిన ఏడాదికి రూ. 1.72 లక్షల ఆదాయం రాగా, ఈ సారి రూ.2.18 లక్షలు వచ్చింది. వారపు సంతకు రూ. 1.21 లక్షల నుంచి రూ.1,22,500కు వచ్చింది. వేర్వేరుగా నిర్వహించిన వేలం పాటలో చెరో 28 మంది వంతున పాటదారులు హాజరయ్యారు. సర్పంచ్ మంత్రి జయరజని, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, జన సేన నాయకుడు వేగి కోటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి

అనకాపల్లి టౌన్: చిరు పొట్ట దశలో ఉన్న వరి పైరులో ఎకరాకు 35 కిలోల యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరిలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు కార్టప్ హైడ్రో క్లోరైడ్ 4జి గుళికలను ఎకరాకు 8 కిలోల చొప్పున 20 కిలోల ఇసుకలో కలిపి పొలమంతా సమానంగా చల్లుకోవాలన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున మొక్కజొన్న పైరు బెట్టను తట్టుకోలేదని రైతులు మొక్కజొన్నకు నీటి తడులను ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు 1500 పీపీఎం వేప నూనె 5 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వేరుశెనగ పంటలో దీపపు పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని, నివారణకు 1.6 మిల్లీలీటర్ల మోనోక్రటోఫాస్ లేదా 2 మిల్లీలీటర్ల డైమిథోయెట్ లీటరు నీటిలో పిచికారీ చేయాలన్నారు. పూత దశలో ఉన్న నువ్వు పైరులో ఒక కిలో మ్యాంకోజెబ్‌ను పిచికారీ చేయాలని, ఆకు ముడత పురుగు వేరు కుళ్లు తెగులు ఆశించవచ్చని, ఆకు ముడత నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్ల వేప నూనె 5 మిల్లీలీటర్లు, మాంకోజెబ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలని తెలిపారు. బొప్పాయిలో పిండి నల్లి ఆశించే అవకాశం ఉందని, లీటరు నీటికి 0.3 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్‌ను కలిపి పిచికారీ చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ కె.వి. రమణమూర్తి, డాక్టర్ వి. గౌరీ, డాక్టర్ బి. భవానీ, డాక్టర్ పి.వి. పద్మావతి, డాక్టర్ ఎ. అలివేణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



జవాన్లకు స్వాగతం పలుకుతున్న రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాశంకర్



పాల్గొన్న విద్యార్థులు

కశింకోట: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) జవాన్ల బృందం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా, భద్రత, దేశభక్తిపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన సైకిల్ ర్యాలీ మంగళవారం కశింకోటకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక నూకాంబిక ఆలయం వద్ద ఇక్కడి రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు. బృందం సభ్యులు విద్యార్థులతో మమేకమయ్యారు. అనర్థదాయకమైన డ్రగ్స్‌కు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని, భద్రత పాటించి దేశభక్తి కలిగి ఉండాలని జవాన్ల బృందం కోరింది. ఈ నెల 7న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బక్కలి నుంచి సైకిల్ ర్యాలీ చేపట్టామని, ఇది దేశవ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాల మీదుగా 6553 కిలోమీటర్ల మేర సాగి తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారి వరకు సాగి ముగుస్తుందని సీఐఎస్ఎఫ్ జవాన్లు తెలిపారు. 79 మందితో కూడిన జవాన్ల బృందం, కళాశాల ప్రిన్సిపాల్ బి. ఉమాశంకర్, అధ్యాపక సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ తదితరులు సీఐఎస్ఎఫ్ బృందానికి స్వాగతం పలికారు.

సమావేశ ప్రాంగణానికి రూ.2 లక్షలు మంజూరు

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. లాబొరేటరీ, ఆపరేషన్ థియటర్, వార్డును పరిశీలించారు. మందులు, ఓపీ వివరాలను వైద్యాధికారి లీలాప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో సమావేశాల నిర్వహణకు సంబంధించి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని షెడ్డు నిర్మాణానికి మండల పరిషత్ నిధుల నుంచి రూ. 2 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ఎంపీపీ ప్రకటించారు. బుధవారం నుంచి ఈ షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. ఆనంతరం ఆయన సిబ్బందితో బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకున్నారు.

భూ ఆధార్ కార్డుతో రైతులకు పలు ప్రయోజనాలు

కశింకోట: భూ ఆధార్ కార్డు కోసం రైతులు తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న కోరారు. మండలంలోని కొత్తపల్లి, తేగాడ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ ఆధార్ కార్డు వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల వల్ల ప్రయోజనం పొందుతారన్నారు. ఈ సందర్భంగా వరి, నువ్వు పంటల పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వరిపై ప్రస్తుతం కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 4జీ8కేజీ ఎకరాకు 20 కిలోలు ఇసుకలో కలిపి పొలం అంతటా సమంగా జల్లుకోవాలని సూచించారు. ఏఈవో ఎ. నూక శ్రీనివాసరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నువ్వు పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి స్వప్న

జీడి పిక్కలను ఆర్బీకే ద్వారా కొనుగోలు చేయాలి

కె.కోటపాడు : జీడి పిక్కలను రాష్ట్ర ప్రభుత్వమే ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయించాలని సీపీఎం నాయకుడు గండి నాయినిబాబు అన్నారు. దాలివలస గ్రామంలో గల సచివాలయ సిబ్బందికి జీడి రైతుల సమస్యలపై మంగళవారం ఆయన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి పిక్కలకు కిలోకు రూ.200 మద్దతు ధరను కల్పించాలని కోరారు. జీడి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక నిధిని కేటాయించాలని తెలిపారు. జీడి సాగుకు అవసరమైన పనిముట్లను రైతులకు ఉచితంగా అందించడంతో పాటు ఉపాధి హామీ నిధులను జీడి సాగు రైతులకు ఎకరానికి రూ.94వేలను అందించి పంటను ప్రోత్సహించాలని, బ్యాంక్ రుణాలను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు, జీడి సాగు రైతులు పాల్గొన్నారు.



జీడి రైతుల సమస్యలపై వినతిపత్రం అందిస్తున్న నాయినిబాబు తదితరులు

వీవీ అగ్రహారంలో మోదకొండమ్మ తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలో వీరవల్లి అగ్రహారంలో గల మోదకొమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం సమీపంలో ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 15 ఎడ్ల జతలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గిరిజనులకు మంచినీటి సౌకర్యం కల్పనకు చర్యలు

పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు



గిరిజనులతో మాట్లాడుతున్న గరిశింగి సర్పంచ్ గూడెపు రాము, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ చంద్రశేఖర్

దేవరాపల్లి: గరిశింగి పంచాయతీ శివారు కొండపై నివసిస్తున్న ఆదివాసీ గిరిజన కుటుంబాలకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు సర్పంచ్ గూడెపు రాము తెలిపారు. ఈ మేరకు సదరు ఆదివాసీ కుటుంబాలు నివాస ప్రాంతాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.చంద్రశేఖర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. వీరికి తాగునీటిని సమకూర్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. సమీపంలో బావిలో నీరు ఊటగా రావడాన్ని గుర్తించి, ఆ బావిలో నందలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో మోటారు ఏర్పాటు చేసి ప్లాస్టిక్ ట్యాంక్‌లోకి పంపింగ్ చేసి తద్వారా అక్కడ నివసిస్తున్న ఎనిమిది కుటుంబాలకు ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు సర్పంచ్ తెలిపారు. దశాబ్దాలుగా వేధిస్తున్న మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపారు. కాగా వారం రోజుల క్రితమే ఈ ఆదివాసీ కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించామని, తన హయాంలో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో గూడెపు మోహన్, దువ్వార చిలుకు, వంజువంజుల నాగరాజు, గూడెపు అప్పారావు తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి గోపినాథ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుల్తాన్ పాల్గొన్నారు.

జోగన్నపాలెంలో మావుళ్లమ్మ పండగ

కె.కోటపాడు : కింతాడ పంచాయతీ జోగన్నపాలెం గ్రామస్తులు మావుళ్లమ్మ అమ్మవారి పండగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామానికి చెందిన కుబిరెడ్డి కుటుంబీకులు 30 ఏళ్ల తరువాత అమ్మవారి పండగను నిర్వహించారు. మావుళ్లమ్మ మందిరంలో ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు బారులు తీరారు. మావుళ్లమ్మ మందిరంలో మాజీ డిప్యూటీ సీఎం, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు ప్రత్యేక పూజలను జరిపారు. ఆయన వెంట సర్పంచ్ బండారు ఈశ్వరమ్మ, ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు పాల్గొన్నారు. నిర్వాహక కమిటీ సభ్యులు మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



అమ్మవారిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

ప్రకృతి సేద్యంపై దృష్టి సారించాలి

నాతవరం : ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులతో పండించిన వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన విక్రయాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులు దృష్టి సారిస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులతో పాటు ఆదాయం పొందవచ్చున్నారు. ప్రస్తుతం మార్కెట్లో సేంద్రియ ఎరువుతో పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు ఊహించని గిరాకీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, వ్యవసాయశాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

'గుడ్ టచ్, బ్యాడ్ టచ్'పై అవగాహన

నర్సీపట్నం: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని రూరల్ ఎస్సై రాజారావు పేర్కొన్నారు. అవేర్నెస్ పోలీసు రథం ద్వారా మదర్ బీఎస్సీ నర్సింగ్ కాలేజీ, జెడ్పీ హైస్కూల్ చెట్టుపల్లిలో గుడ్ టచ్, బాడ్ టచ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏది గుడ్ టచ్.. ఏది బ్యాడ్ టచ్ అన్నది విద్యార్థులు గ్రహించి, బ్యాడ్ టచ్ అయితే తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. బాలికల రక్షణకు పోక్సో చట్టం ఉందన్నారు. ఈ చట్టంలో శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. బాల్య వివాహాలను ఎవరు ప్రోత్సహించినా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ సూచించారు.



ఎల్ఈడీ స్క్రీన్‌పై గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజారావు

